లేటవడం కాదు, సాక్షాత్తూ రైలు బయల్దేరే చోటనే నాలుగు గంటల పది నిమిషాలు (రెండు వందల యాభై 'నిమిషాలు' మాత్రమే) ఆలస్యం అవుతోందన్నమాట. నిరుద్యోగం, అనారోగ్యం మొదలైన ఈతిబాధల్లో ఇది కూడా ఒకటి, మనకి.

"రోజుకి కోటిమంది ప్రయాణీకుల్ని రవాణా చేస్తున్న భారతీయ రైల్వే; దేశపు నరాల నిర్మాణం (నెర్వస్ సిస్టమ్) వంటిది" అని రైల్వే శాఖవారు అక్కడక్కడా ఉంచే బోర్డుల ద్వారా, అప్పుడప్పుడు టి.వి.లో చూపించే ప్రకటనల ద్వారా మనల్ని హెచ్చరిస్తూ ఉంటే నా నరాల నిర్మాణం (నెర్వస్ సిస్టమ్) దెబ్బతినేస్తూ ఉండడం అలవాటైపోయింది.

నిన్న మా అమ్మాయి విజయవాడ నుంచి వచ్చింది.

"ఏ బండిలో వొచ్చేవు?" అని పలకరించేను.

"సింహాద్రి పేసింజర్‌లో." అంది.

"సింహాద్రి ఎక్స్‌ప్రెస్ అనా, నీ ఉద్దేశం?" అన్నాను.

"నా మొహం, అది ఎక్స్‌ప్రెస్సేమిటి? రేటుకి మాత్రం ఎక్స్‌ప్రెస్సు. ఉదయం తొమ్మిదింటికి బెజవాడలో బైల్దేరి సాయంకాలం ఏడింటికి వాల్తేరు స్టేషన్ చేరింది. 350 కిలోమీటర్ల దూరం కోసం పదిగంటల టైమ్ తీసుకుంది. నాకంఠంలో ప్రాణం ఉన్నంత వరకు దాన్ని నేను 'సింహాద్రి పేసింజర్' అనే అంటాను!" అంది మా అమ్మాయి.

రైల్వే పరిభాషలో పాసింజర్ అంటే రెండెడ్ల బండీ అని వేరే చెప్పక్కర్లేదు, దీనికి తార్కాణంగా విశ్వనాథ సత్యనారాయణ గారి జోకు ఒకటుంది. ఆయనొకసారి గుడివాడ నుంచి బందరు రైల్లో వెడదామని బయలుదేరుతూ ఉంటే ఒక ముసిలావిడ కర్రతో సహా నడుస్తోందిట. టిక్కెట్టుకి డబ్బులు లేక నడక మొదలెట్టిందేమోనని అనుమానించి "రైల్లో పోదాం రా బామ్మా, నీ టిక్కెట్టు నేను కొనిపెడతాలే" అన్నారట ఈయన. "ఒద్దులే నాయనా; నాకు ఈ రోజు కోర్టులో వాయిదా ఉంది; నడిచే వెళ్తాను" అన్నదట ఆ మూడుకాళ్ల ముసలిది. ★

# 29. నా పేరేమిటి?

**మా** అమ్మమ్మ ఒక కథ చెప్తూ వుండేది. అలాటి కథలు ఇప్పుడు ఎవరి అమ్మమ్మలైనా అసలు చెబుతున్నారో లేదో అని అనుమానం వేస్తున్నా, మా అమ్మమ్మ చెప్తూ వుండే కథలు ఆ రోజుల్లో మాకు అవి ఏవో అమ్మమ్మ కథల్లా అనిపించేవి కాదు.

అనగా అనగా ఒక ఈగ. ఆ ఈగ, ఇల్లు అలుకుతూ, తన పేరేమిటో మరచిపోయి గొప్ప బాధపడిపోయింది. అలుకుతూ, అలుకుతూ ఉన్న ఇంటిని అలా వదిలేసి పేదరాసి పెద్దమ్మ దగ్గరికెళ్లి, "పెద్దమ్మా, నా పేరేమిటి" అని అడిగింది. "నాకు తెలీదు, మా అబ్బాయిని అడుగు" అంది పెద్దమ్మ. అలా ఈగ గారు పేదరాసి పెద్దమ్మనీ, పెద్దమ్మ కొడుకునీ, కొడుకు చేతి గొడ్డలిని, గొడ్డలి కొట్టే మ్రానుని, మ్రాను మీద వాలే రామచిలుకని, రామచిలుకని పెంచే రాజకుమారుణ్ణి, రాజకుమారుడెక్కే గుర్రాన్ని, గుర్రం కడుపులో ఉన్న పిల్లని అడిగితే గాని

తనపేరు "ఈ..ఈ..ఈ..ఈగ" అని తెలిసింది కాదు.

ఈ కథలో ఈగ పడ్డ అవస్థలో ఈ మధ్య నేను కూడా పడ్డానేమో అని నా అనుమానం. అంటే, నా పేరు నేనే మరచిపోయానని కాదు. నాతో అప్పుడప్పుడు ఏదో పనులు ఉండే కొందరు జెంటిల్మన్లు (పెద్ద మనుషులు అంటే ఏదో వికారార్థం స్ఫురిస్తుందని జెంటిల్మన్లు అంటున్నాను, అంతేగాని రీడర్ను ఇంగ్లీషు మీడియంలో చేర్చాలని కాదు) నా పేరు సమంగా గుర్తు రాకనో, గుర్తొచ్చి కూడా పలకలేకనో, పలకగలిగి ఉండీ కూడా స్పెల్లింగు తప్పులు లేకుండా రాయలేకనో తయారయి, నా పేరు సరిగ్గా ఏమిటో నాకే తెలియకుండా చెయ్యడం మొదలెట్టేసరికి, ఈగ పడ్డ అవస్థలో నేనూ పడ్డానని అనిపిస్తోంది.

నాకు సర్వే డిపార్టుమెంట్లో ఉద్యోగం వచ్చిన నాటికి మనది ఉమ్మడి మద్రాసు రాష్ట్రం. (మెడ్రాస్ ప్రెసిడెన్సీ - అనగా ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక, కేరళ అనే నాలుగు రాష్ట్రాలు కలిసివుంటూ వచ్చిన 'సౌతిండియా'. "మద్రాసు ప్రెసిడెన్సీ" కనుక ఈ నాలుగు రాష్ట్రాల వాళ్లనీ ఔత్తరాహులు 'మద్రాసీలు' అనేవారు. అందువల్ల పెద్ద నష్టం లేదు. కాని ఆ రోజుల్లో ప్రభుత్వ శాఖలన్నిట్లోనూ ఉన్నతాధికారులు తమిళులూ, మలయాళీలే ఎక్కువమంది ఉండడం, వారి దయవల్ల తమిళ, మళయాళ-సోదరులు మన ప్రాంతంలో సులువుగా ఉద్యోగాలు సంపాదించడం సహజమై, సర్వేయర్లేమిటి, రెవిన్యూ ఇన్స్పెక్టర్లుగా కూడా తమిళులు ఉండేవారు.

ఆ వరసలో పద్మనాభ నంబియార్ గారనే ఒక అధికారి నాకు ఉద్యోగం ఇచ్చి నా పేరు బి.ఆర్. 'గోపాలన్' గా నమోదు చేసేడు. ఆ తరువాత కొన్నాళ్లకి నాకు 'రామచంద్రన్' గారు అధికారిగా ఉన్న ఒక ఆఫీసుకి ట్రాన్స్ఫరైతే నేను వెళ్లి జాయినింగ్ రిపోర్టు ఇచ్చాను. ఆయన నావేపు చాలా దయగా చూసి, 'ఐయామ్ వెరి గ్లాడ్. ఉక్కారుంగొ. ఎన్న డిస్ట్రిక్ట్ ఉంగళది?" అన్నాడు నేను సిగ్గుపడిపోయి "ఐ యామ్ సారీ సార్. మాది విజయనగరం నేటివ్ ప్లేస్ సార్..." అన్నాను తమిళనాడులో ఏదైనా ఒక జిల్లా నా స్వస్థలం కాకపోయిందే అని విచారిస్తూ.

నేను అలవాటుగా రచనలు చేసే ఒక పత్రిక వారు నా రచనలు స్పష్టంగా నావి అని చప్పున పాఠకుల దృష్టికి వచ్చే విధంగా ఒక 'లోగో' చిత్రింపించి నా రచనలన్నిటిని (ట్రేడుమార్కు వంటి) లోగో కింద వేస్తారు. అయితే ఈ పత్రిక వారు నాకు ఆ రచనల నిమిత్తం పంపే పారితోషికం ఎకౌంట్ సెక్షన్ ద్వారా పంపాలి కదా. వారిలో నాకు ఎలాంటెలాంటి అభిమానులున్నారంటే, చెక్కులమీద వారు వ్రాసే నా పేరు ఎలా ఉంటూ ఉంటుందో చెబితేచాలు, అర్థమైపోతుంది. 'భగోరా', 'బరాగో', 'బమిడిపాటి రామగోపాలరావ్', 'బి. రాంగోపాల్', 'బి.వి.రామ్‌గోపాల్' - ఇత్యాది. ఆ పత్రిక నుంచి నాకు వచ్చిన కొన్ని డజన్ల చెక్కుల్లో ఒకటి రెండు సార్లు నా పేరు సరిగ్గా రాయకపోలేదు. కాని, ఏ చెక్కు ఏ చిక్కు తెస్తుందో అని అనునిత్యం భయమే-నాకు.

వచ్చేది చెక్కే గనకాను, "ఎకౌంటు పేయి" (అనగా ఆ పేరు గల వ్యక్తి ఏదైనా బ్యాంకులో నడుపుకుంటున్న ఎకౌంట్) కే గనకానూ, పెద్ద ఇబ్బంది కలిగేది కాదు. 'శంభు రీశః పశుపతి ర్శివ శ్శూలీమహేశ్వర' లో ఏ పేరైనా శంకరుడిదే అని అర్థమైనట్టు మా బ్యాంకు వాళ్లు మాత్రం, పత్రిక వాళ్లు నా పేరు చెక్కుల మీద ఎలా రాసినా నా ఎకౌంట్‌కి జమ చేసేసే వారు. ఆఖరికి,

'బి. రాజగోపాలరావు' అని చెక్కు మీద రాసినా సరే నా అకౌంట్‌లో జమ చేసే వీలు ఏర్పడింది.

అయితే ఒకసారి ఆ పత్రికవారే నాకు కొంత సొమ్ము మనియార్డర్ ద్వారా పంపవలసి వచ్చింది. మనియార్డరు ఫారం మీద 'బరాగో' అని ఉండడం వల్ల పోస్టుమాన్ నాకు 'సారీ' చెప్పి ఆ ఎం.ఓ. వెనక్కి పంపేస్తూ 'అయ్యగారూ, వాళ్లకి తమరి పేరు ఫలానా అని స్పష్టంగా రాసియ్యాలండి' అని నాకు సలహా చెప్పేసేడు.

నా పేరుతో సరసం ఆడే వాళ్లలో మా మేనత్త కొడుకు 'ఎస్. వెంకన్న' కూడా ఉన్నాడు. ఒకసారి అతను నాకు ఉత్తరం రాసి ఇన్‌లాండ్ కవరుమీద అడ్రస్‌లో 'తప్పుడు మనిషి' అనే అర్థం వచ్చే విధంగా ఇంగ్లీషులో 'రాంగ్-ఓ-పాలం' అని రాస్తే ఆ అవమానం మింగలేక అతనికి నేను రాసిన జవాబుకి 'ఎస్.వి.ఖన్నా' అని అడ్రస్‌లో రాసేసి ఊరుకున్నాను.

బండి గోపాలరెడ్డి (బంగోరె) అని ఒక సాహితీ విమర్శకుడు, పరిశోధకుడు ఉండేవాడు.

కొన్నాళ్ల కిందట అతను ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ వార్త పత్రికల్లో వచ్చిన రోజున నేను మా ఆఫీసుకి వెళ్లగా మా ఆఫీసు రెండో అంతస్తు దగ్గిర ఒకాయన నన్ను ఆపి, చెప్పలేనంత భావోద్వేగంతో నిట్టూర్పులతో నన్ను దగ్గిరిసా లాక్కుని, 'ఈ ఉదయం మీ గురించి ఎంతో విషాదకరమైన వార్త చదివేను సార్. ఏమైనా సరే, దేవుడు చాలా గొప్పవాడు. మిమ్మల్ని మళ్లీ ఇలా సజీవంగా చూస్తాననుకోలేదు. థాంక్ గాడ్!' అన్నాడు. అతని ఉద్వేగం తగ్గింది. 'బంగోరె' కీ 'భరాగో'కీ తేడా బోధపరచడానికి నాకు ఖరాగా పది నిమిషాలు పట్టింది.

గురుదాస్ అని మాకో ఆఫీసర్ ఉండేవాడు. ఆయనకి "పేరుమీద"(బైనేమ్) వచ్చే ఉత్తరాల్లో ఆయన పేరు ఆయా ఆఫీసుల్లో టైపిస్టుల చిత్తవృత్తిని బట్టి "గుర్-దాస్" అనీ "గురు-దాసు" అనీ వచ్చేది. ఒకానొక కొంటె టైపిస్టు "గుఱ్ఱు-దాసు" అని ప్రయోగించేడు.

అదిచూసి ఎవ్వరో నవ్వినట్టనిపించి దాని అర్థం తెలుసుకున్న వెంటనే నాపేరు ఫలానా స్పెల్లింగులో మాత్రమే రాయాలి సుమండీ అని ఈయన సర్క్యులర్ పంపేడు.

మహదేవ దేశాయిగారు రాసిన "గాంధీ గాథావళి" అనే పుస్తకంలో ఒక ఉదంతం వుంది. "మోహన్‌దాస్ కరమ్‌చంద్ ఘాంది" అనే చిరునామాతో వచ్చిన ఒక ఉత్తరాన్ని మహాత్మాగాంధీ గారు పుచ్చుకోలేదట. "ఘాంది" (Ghandi) అనేది పార్సీ కుటుంబం నామం అనీ తాను పార్సీ కాదనీ అన్నారట. ప్రాపంచిక ప్రయోజనాలు కోసం "గాంధీ"లుగా మారిన "ఘాందీ"లు మహాత్ములూ పుణ్యాత్ములూ కాలేకపోయారు.

విన్‌స్టన్ చర్చిల్ అనే బ్రిటిష్ ప్రధానమంత్రి కూడా ఒకసారి సర్ విన్‌స్టన్ ఎస్. చర్చిల్, నెం. 10, డవునింగ్ స్ట్రీట్ అంటూ వివరంగా అడ్రసు ఉన్న ఒక ఉత్తరం (చర్చిల్ అనే పదంలో రెండు "ఎల్"లకి గాను ఒకటే ఉండడం వల్ల!) తనది కాదని తిరస్కరించేరట.

కిందటి వారంలో ఓరోజు నేను గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ వెళ్లవలసి వచ్చింది. రిజర్వేషన్ అప్లికేషన్‌లో నా పేరు నేను స్పష్టంగానే రాసినా ఛార్ట్‌లో"బి. ఆర్ గోపాలన్" అనే టైపు అయింది. సరే, అని రాజీపడి కంపార్ట్‌మెంట్‌లో చేరాను. ఇంతలో 'ఎక్స్‌క్యూజ్‌మి-' అంటూ ఒక వ్యక్తి వచ్చి నా పక్కని కూర్చున్నాడు. "నేను కూడా ఈ రైల్లో హైదరాబాద్ వెళ్తున్నాను" అని ఇంగ్లీషులో సంభాషణ ప్రారంభించేడు. "57 వ నెంబరు బెర్తు రిజర్వ్ అయిన గోపాలన్‌గారు

మీరే అని నమ్ముతున్నాను. నేనూ, నా సన్నిహిత మిత్రుడైన రామ్‌దాసు-ఈ పూటకి ఈ రైలుకి బెర్తులు రిజర్వ్ చేయించుకోగా, 'అతనికి ఈ కంపార్ట్‌మెంట్‌లో 58వ నెంబరు బెర్త్ ఇచ్చి, నాకు వేరే కంపార్ట్‌మెంట్‌లో 57 ఎలాట్ చేసేరు. కొన్ని కారణాల వల్ల మేం ఇద్దరం ఈ ప్రయాణంలో చెప్పుకోవలసిన కబుర్లు కొన్ని ఉన్నాయి గనుక, దయచేసి మీరు నా రిజర్వేషన్ టిక్కెట్టుతో ఆ కంపార్ట్‌మెంట్‌లో 57కి వెళ్లిపోయి నాకు ఈ బెర్తు వదిలిపెట్టమని కోరుతున్నాను." అన్నాడు. మేం ఇద్దరం ఈ సందర్భంగా బోలెడు ఇంగ్లీషు మాట్లాడుకున్నాం. సరేకదా అని నేను కాంప్రమైజ్ అయిపోయి నా టిక్కెట్టు అతనికి ఇచ్చేసి అతని టిక్కెట్టు నేను తీసుకున్నాను. సూట్‌కేసు పుచ్చుకుని లేచి, తెలుగులో 'అయితే, అక్కడ నా పేరేమిటి?' అన్నాను.

అతను నావేపు ఆశ్చర్యంగా చూసి, అరె! మీరు తెలుగువాళ్లేనా; నయం, ఇంతసేపూ ఇంగ్లీషులో మాట్లాడుకున్నామే!' అన్నాడు.

'నా పేరేమిటి, చెప్పండి తొందరగా! బండి బయల్దేరే వేళ అయింది' అన్నాను.

అతను హాయిగా నవ్వి "మీ పేరు అశ్వినీకుమార్ దత్తు" అన్నాడు, ★

# 30. ఖాళీలను పూరింపకుము

**"ఖాళీలను** పూరింపుము" (ఫిలప్ ది బ్లాంక్స్)అనే రకం ప్రశ్న ఒకటి ఇచ్చి; దానికింద ఎ.బి.సి.డి. ఇలాగ బిట్లు ఏర్పరచి ప్రశ్న అంటూ అడక్కుండా సమాధానం రాబట్టే పద్ధతి మన విద్యావిధానంలో అత్యంతమిక్కిలి పురాతనమైనది. రాముని భార్య..... సుగ్రీవునికిని, వాలికిని......వలన వైరము కలిగెను. అశోకుడు......వేయించెను. ఈ మూడు సింపులు బ్లాంక్సులూ "ద్రౌపది", "మండోదరి" "వంకాయ ముక్కలు" అని నింపితే మార్కులు రావు కదా. అలా తప్పుగా నింపిన వాళ్లని, అసలు బ్లాంకుల కొశ్చన్లు ఆన్సర్ చెయ్యని వాళ్లని నిర్దాక్షిణ్యంగా పరీక్ష ఫేల్ చేసేసి కింది క్లాసులో మరొక యాడాది చదివించెయ్యాలని మా నాన్నగారు అంటూ వుండేవారు. బిట్టు కొశ్చన్లలో ఇచ్చే ఆన్సర్లు నాలుగింట్లో ఒకటి టిక్కు పెట్టే సంస్కృతి ఆయనకి తెలిస్తే ఇంకా ఏం అనేవారో, మరి!

నేను స్కూలు ఫైనలు పరీక్షరాయగానే నాకు విజయనగరం కో-ఆపరేటివ్ బాంక్‌లో చిన్న ఉద్యోగం ఒకటి వచ్చింది. ఖాతాదార్లు బ్యాంకుకి డబ్బు కట్టడం, తీసుకోవడం, చెక్కులో, డ్రాఫ్టులో అడగడం యిలాటి పనుల మీద వొచ్చేవాళ్లు. ఈ పనులన్నిటికీ దరఖాస్తులు అచ్చువి ఉంటాయి. ఖాతాదారు పేరు, ఖాతా సంఖ్య, లెడ్జరు ఫోలియో నెంబరు, సొమ్ము, తేదీ ఇటువంటివి బ్లాంకుగా వుంచేసి మిగిలిన వన్నీ అచ్చువేసి ఉంటాయి ఆ ఫారాల్లో. నా పని ఏమిటంటే అట్టే చదువురాని - ఖాతాదార్లు వచ్చినపుడు వాళ్లు ఏ పని మీద బ్యాంకుకి వచ్చేరో తెలుగులో అడిగి; దానికి తగిన ఫారం తీసి బ్లాంకులన్నీ నింపి వాళ్ల సంతకాలో, వేలిముద్రలో తీసుకుని వాళ్లని క్యాష్ కౌంటర్‌కి పంపడం. దీనికి నెలకి ఇరవై రెండు రూపాయలు ఇచ్చేవారు. (ఇది 1946. బస్తా బియ్యం 22 రూపాయలకి వొచ్చే రోజులు)

ఒకానొక ఖాతాదారు తనకి ఎక్కణ్ణించో వొచ్చిన చెక్కు నాకిచ్చి; అందులో ఉదహరించిన